కెఎస్ జవహర్‌రెడ్డికి టిటిడితో అనుబంధం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ఎపి సిఎస్‌గా నియమితులైన కెఎస్ జవహర్‌రెడ్డి గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగానూ పనిచేశారు. డిసెంబర్ 1 నుంచి కొత్త ప్రధాన కార్యదర్శిగా జవహర్‌రెడ్డి బాధ్యతలు తీసుకోనున్నారు. 2024 జూన్ వరకూ ఆయనకు సర్వీసు ఉంది. అంటే మరో ఏడాదిన్నర పాటు ఆయన సిఎస్ పోస్టులో కొనసాగే అవకాశం ఉంది. ఆయన 1990 ఐఎఎస్ అధికారి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జవహర్‌రెడ్డి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన కోరిక మేరకే టిటిడి ఈవోగానూ నియమించారు. ఆ పోస్టులో కొనసాగిస్తూనే, సిఎంఒకి తీసుకొచ్చారు. కొన్ని నెలల పాటు ఆయన రెండు బాధ్యతలను నిర్వహించారు.

ఓటర్ల జాబితా నవీకరణ పకడ్బందీగా చేపట్టాలి

పరిశీలకులు ప్రద్యుమ్న

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రత్యేక ఓటర్ల సవరణ అన్నది ప్రతి సంవత్సరం ఎప్పటికప్పుడు నవీకరణ కోసం చేపట్టే కీలక కార్యక్రమమని ఎలెక్టరోల్ అబ్జర్వర్ పి.ఎస్.ప్రద్యుమ్న అన్నారు. మంగళవారం మద్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో ప్రత్యేక ఓటర్ల సవరణ 2023 పై ఎలెక్టరోల్ అబ్జర్వర్, జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, డిప్యూటీ ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో, ఇ.ఆర్.ఓ. లతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఎస్.ఎస్.ఆర్. 2023 వివరిస్తూ జిల్లాలో ప్రీ రివిజన్ కార్యక్రమం ఆగష్టు 4 నుండి ప్రారంభించామని, ఈ నెల 9 న ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ జాబితా ను ప్రకటించామని, డిసెంబర్ 8 వరకు అభ్యంతరాలను స్వీకరించి 2023 జనవరి 5 న పూర్తి స్థాయి ఓటర్ల జాబితా ప్రకటించనున్నామని వివరించారు. జిల్లాలో 7 నియోజకవర్గాలకు సంబందించి మొత్తం ఓటర్లు 17,29,745 మంది ఉన్నారని 2,112 పోలింగ్ కేంద్రాలు కలవని వివరించారు. ఎలెక్టరోల్ అబ్జర్వర్ పి.ఎస్.ప్రద్యుమ్న మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ల సవరణ సమయంలో బి.ఎల్.ఓ. లు, బి.ఎల్.ఎ లు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే ఖచ్చితమైన ఓటర్ల జాబితా సిద్ధమై ఎన్నికల సమయంలో సమస్యలు తగ్గుతాయనేది గుర్తించాలని అన్నారు. బి.ఎల్.ఓ. లుగా సచివాలయ సిబ్బంది నియామకం జరిగిందని, గతంలో అంగన్వాడీ వర్కర్లు బి.ఎల్.ఓ లు గా ఉండేవారని అన్నారు. ప్రస్తుతం ఉన్న బి.ఎల్.ఓ.లు దాదాపు విద్యావంతులు అయినందున వారికి శిక్షణ ఇచ్చి ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు జాబితా సిద్ధం చేయాలని సూచించాలని అన్నారు. జిల్లాలో ఆధార్ లింకేజ్ 62 శాతంగా ఉందని ఆధార్ అనుసంధానం వల్ల ప్రస్తుతం పథకాలలో బోగస్ లబ్దిదారులను తొలగించినట్లే డూప్లికేట్ ఓటర్లను సాఫ్ట్వేర్ తో తొలగించడానికి వీలు ఉంటుందని ఇది ఒక ఖచ్చితమైన ఓటర్ల జాబితాకు నిదర్శనంగా ఉంటుందని అన్నారు. ఎన్నికల విధులలో ఎన్నికల కమీషన్ సూచనల మేరకు వాలంటీర్లను ఎటువంటి పరిస్థితులలో వినియోగించరాదని అన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.ఎల్.ఎ ల నియామకం చేపట్టాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, నియోజకవర్గ ఈఆర్‌ఓలు గూడూరు- కిరణ్ కుమార్, సూళ్ళూరుపేట రోజ్ మాండ్, వేంకటగిరి శ్రీనివాసులు, చంద్రగిరి కనకనరసారెడ్డి, తిరుపతి అనుపమ అంజలి, శ్రీకాళహస్తి- రామారావు, సత్యవేడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అక్రమాలను అరికట్టండి: సిపిఎం

తిరుపతి జిల్లాలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీల ఓట్ల నమోదులో భారీగా అక్రమాలు జరిగాయని, ఓటర్లు కాని వారిని కూడా ఓటర్లుగా చేర్పించారని, అధికార పార్టీ అభ్యర్థులు బహిరంగంగా ఈ అక్రమాలకు పాల్పడ్డారని, సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డికి సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సక్రమమైన ఓటర్ లిస్టు తయారు కావడానికి అధికారులు చిత్తశుద్ధితో కషి చేయాలని, చేయనివారు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. చివరి రోజుల్లో ఎక్కువ మోతాదులో ఓట్లు నమోదు కావడమే ఇందుకు తార్కాణమని తెలిపారు. ఓటర్లను ఎటువంటి పరిశీలన చేయకుండా నిజమైన ఓటర్లను తిరస్కరించడం అర్హులు కాని వారివి ఆమోదించడం వంటివి చేశారన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు , నాయకులు జయచంద్ర, వేణు

అదేవిధంగా ఒకే ఓటర్ ఫోటోతో డబల్, త్రిపుల్ ఓట్లని నమోదు చేశారని, ఎందుకు తిరస్కరించారో కారణాలు తెలపలేదన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించడం తప్ప ఇంకోటి కాదని తెలిపారు. జిల్లాకు ప్రత్యేక ఐఏఎస్ అధికారిని కేటాయించి సమగ్ర విచారణ జరిపితే తప్ప వాస్తవాలు బయటికి రావని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎస్ జయచంద్ర, నాయకులు వేణు పాల్గొన్నారు.

క్రీడా మైదానాల ప్రైవేటీకరణ వద్దు : డివైఎఫ్ఐ

రాష్ట్ర ప్రభుత్వం క్రీడా మైదానాలను, ఇండోర్ స్టేడియంలను, క్రీడా వికాస కేంద్రాలను ప్రైవేట్ వారికి లీజుకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.జయచంద్ర విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ క్రీడా మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను, స్విమ్మింగ్‌పూల్, జిమ్ సెంటర్లను, పే అండ్ ప్లే పేరుతో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాదికార సంస్థ (శాఫ్) ప్రైవేట్ కాంట్రాక్టర్లకు లీజుకిచ్చే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. 'పే టు ప్లే' వల్ల క్రీడాకారులపై సభ్యత్వ ఫీజు, నెలనెలా ఫీజు, సామాగ్రి ఛార్జీల భారం, వసతి భారం పడుతుందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు నాయకులు వేణు పాల్గొన్నారు.

ప్రముఖ స్త్రీవాద రచయిత ఓల్గాను సత్కరిస్తూ...

మాలతీచందూర్ సాహిత్యామృతాన్ని పంచారు

ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా

ప్రజాశక్తి - గుడిపల్లి

ప్రముఖ రచయిత మాలతీచందూర్ సాహిత్యామృత్యాన్ని సాహితీప్రియులకు పంచారని స్త్రీవాద రచయిత్రి, ఉద్యమ నేత ఓల్గా అన్నారు. ద్రావిడ విశ్వ విద్యాలయం తెలుగుశాఖ ఆచార్య కె.శ్రీదేవి ఆధ్వర్యంలో 'మాలతి చందూర్ ధర్మనిధి ఉపన్యాసాల సదస్సు'ను ఎమినో సెమినార్ హాలులో మంగళవారం నిర్వహించారు. మాలతీచందూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఓల్గా కీలకోపన్యాసం చేస్తూ మాలతీచందూర్ నవలలు చదువుతుంటే ఓ చరిత్రను చదువుతున్నట్లు అనిపిస్తుందన్నారు. ఆమె రచనల్లో స్త్రీలపై జరిగే హింస ఎక్కువగా కనిపిస్తుందని, ఇంట్లో, బయట, చదువుకునే, ఉద్యోగం చేసే చోట పడే హింసను తన రచనల్లో తెలిపేవారన్నారు. స్త్రీ సంపాదనను వేడినీళ్లకు చల్లనీరులా మొదట చూశారని, ప్రస్తుతం స్త్రీల సంపాదన ఊహకు అందకుండా ఉందన్నారు. సంక్లిష్ట పరిస్థితుల్లో స్త్రీలు ఎలా నెగ్గుకురావాలన్నది ఆమె నవలల్లో కనిపిస్తుందన్నారు. స్త్రీల మనస్తత్వ చిత్రణ ఆమె నవలల్లో కనిపిస్తుందని, చందూర్ నవలలు చదివితే స్త్రీలకు ఒక శక్తి వస్తుందన్నారు. ప్రస్తుత సామాజిక సమస్యల గురించి స్త్రీలు భయపడకుండా చర్చించుకోవాలన్నారు. పురుషులు సైతం స్త్రీలను అర్థం చేసుకుని వారికి అనుకూలమైన వాతావరణాన్ని కలిగించాలన్నారు. మనిషికి సౌందర్యమనేది అంతరంగం నుంచి రావాలని, బాహ్య సౌందర్యం ఇష్టపతామని, కానీ అసలు ప్రధానమైనది అంత్ణ సౌందర్యమని మాలతీచందూర్ తన నవలల్లో నిరూపించారన్నారు. మొహాలు జ్ఞానంతో వెలగాలే కానీ, క్రీములతో కాదని అన్నారు.

వర్సిటీ ఉపాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ మాట్లాడుతూ సుప్రసిద్ధ రచయిత్రి మాలతీచందూర్ మూడు నాలుగు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారన్నారు. మాలతీచందూర్ ఓ గృహిణిగా ఉండి ఉంటే ఈరోజు ఇంతమంది ఇక్కడ చేరి మాలతీచందూర్ గురించి ఒక ధర్మనిధి ఉపన్యాసాన్ని ఏర్పాటు చేసి ఉండేవాళ్లం కాదన్నారు. మాలతీచందూర్ 1928 ప్రాంతం నూజివీడు ప్రాంతంలో జన్మించారని, ఆడపిల్లలు బడికి సైతం వెళ్లే పరిస్థితులు లేకున్నా ఆమె వాటిని పట్టించుకోకుండా 15 ఏళ్లకే ఆమె రచనలు ప్రారంభించారన్నారు. రెక్టార్ ఆచార్య టినురాధ, తులనాత్మక భాషా అధ్యయన పీఠాధ్యక్షులు ఆచార్య బి.శివకుమార్, శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పిసి వెంకటేశ్వర్లు, స్త్రీవాద రచయిత్రి మందరపు హైమవతి, కడప యోగివేమన విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ టి.రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యాదీవెన నిధులు రూ.30.41 కోట్లు జమ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో 46,798 మంది విద్యార్థులకు 4 వ విడత (జూలై నుండి అక్టోబర్ 2022 వరకు) విద్యా దీవెన రూ.30.41 కోట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి 30 న బుధవారం అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే భహిరంగ సభ నుండి కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేయనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి తెలిపారు. జగనన్న విద్యా దీవెనకు సంబంధించి అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ జిల్లాకు సంబంధించి చంద్రగిరి 8451 మంది, గూడూరు -6353, నగరి -2679, సత్యవేడు -6136, శ్రీకాళహస్తి 7132, సూళ్ళూరుపేట- 6223, తిరుపతి -6219, వేంకటగిరి -3605 మంది విద్యార్థులకు రూ.30.40 కోట్లు జమ కానున్నదని తెలిపారు.

వ్యకాసం రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 29 వ మహాసభలు డిసెంబర్ 8, 9, 10 తేదీలలో ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెంలో జరుగుతాయి. ఈ మహాసభలకు సంబంధించిన గోడపత్రికను సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథిగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకరత్, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు విజయరామన్, ప్రధాన కార్యదర్శి బి వెంకట్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పందవాసి నాగరాజు, జిల్లా అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి బాలకష్ణ, ఉపాధ్యక్షులు గురవమ్మ, ముత్యాలయ్య, సహాయ కార్యదర్శులు రాజగోపాల్ పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం...

ఇన్‌ఛార్జి వీసీగా రాణి సదాశివమూర్తి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయ నూతన ఇన్చార్జి ఉప కులపతిగా ఆచార్య రాణి సదాశివమూర్తి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. జాతీయ సంస్కత విశ్వవిద్యాలయంలో సాహిత్య విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తూ ప్రస్తుతం డిప్యుటేషన్ పై శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ విభాగం డైరెక్టర్ గా ఆచార్య రాణి సదాశివమూర్తి పనిచేస్తున్నారు. ఆచార్య రాణి సదాశివమూర్తిని ఇంచార్జ్ విసి గా నియమిస్తూ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ , రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం ఆయన టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఏవి ధర్మారెడ్డిని కలసి కతజ్ఞతలు తెలిపారు. తాత్కాలిక విసిగా వ్యవహరిస్తున్న టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ వేద విశ్వ విద్యాలయ ఇంచార్జ్ ఉప కులపతిగా బాధ్యతలు స్వీకరించటం తన పూర్వజన్మ సుకతమన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి అనుగ్రహం వలన తనకు ఈపదవి లభించిందని చెప్పారు. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి , ఈవో ఏవి ధర్మారెడ్డి కి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఏవి రాధేశ్యామ్, డీన్ అకడమిక్ డాక్టర్ ఫణియజ్ఞేశ్వరయాజులు ,ఎఫ్ ఓ అంజిరెడ్డి ఏఆర్ సుబ్రహ్మణ్యం, పిఆర్‌ఓ డాక్టర్ టి.బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రయోగాత్మకంగా...

బ్రేక్ దర్శన సమయం మార్పు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు ఒకటో తేదీ నుంచి ప్రయోగాత్మకంగా బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 8 గంటలకు మారుస్తున్నట్టు టిటిడి తెలియజేసింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో రాత్రివేళ వేచి ఉండే భక్తులకు ఉదయం త్వరితగతిన దర్శనం కల్పించేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా భక్తులు ఏరోజుకారోజు తిరుపతి నుండి తిరుమలకు చేరుకుని బ్రేక్ దర్శనం చేసుకునే అవకాశం ఉంది. తద్వారా తిరుమలలో గదులపై ఒత్తిడి తగ్గే అవకాశముంది. అలాగే నవంబరు 30న మాధవంలో శ్రీవాణి ట్రస్టు దాతలకు కౌంటర్ ప్రారంభించనుంది. ఇకపై శ్రీవాణి ట్రస్టు దాతలకు ఇక్కడే ఆఫ్‌లైన్ టికెట్లు కేటాయిస్తారు. గదులను సైతం ఇక్కడే మంజూరు చేస్తారు.

లైంగిక వేధింపులకు పాల్పడిన...

ఉపాధ్యాయుని విచారించిన ఎంఇఒ

ప్రజాశక్తి - దొరవారిసత్రం

విద్యాభ్యాసం నేర్పాల్సిందిపోయి బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుని ఎంఇఒ మస్తానయ్య మంగళవారం విచారించారు. దొరవారిసత్రం మండల పరిధిలోని అనేపూడి గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో డిప్యుటేషన్‌పై పరంధామయ్య అనే ఉపాధ్యాయుడు కొన్ని నెలలుగా విద్యార్థులకు విద్యను బోధిస్తున్నాడు. పదిరోజులుగా బాలికలపై లైంగిక వేధింపులు, అసభ్యకరమైన ప్రవర్తన చేస్తున్నారని బాలికలు వారి తల్లిదండ్రులకు తెలపడంతో తోటి ఉపాధ్యాయులు ఈ విషయాన్ని ఎంఇఒకు తెలియజేశారు. ఎంఇఒ మస్తానయ్య, పూలతోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కృష్ణయ్య బాలికలను, వారి తల్లిదండ్రులను, గ్రామ పెద్దలను విచారించారు. ఉపాధ్యాయుడు తమ పట్ల ప్రవర్తించిన తీరుపై బాలికలు ఎంఇఒకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. నివేదికను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళతామని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుని శిక్షించాలని, తమ పాఠశాలలో ఆ ఉపాధ్యాయుడు ఉండటానికి వీల్లేదని ఖరాఖండిగా తెలిపారు.

4న భగవద్గీత అఖండ పారాయణం

తిరుమల : గీతా జయంతిని పురస్కరించుకొని డిసెంబరు 4న తిరుమల నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం నిర్వహించనున్నారు. ఉదయం 7 నుండి భగవద్గీతలోని 18 అధ్యాయాల్లో గల 700 శ్లోకాలను పండితులు నిరంతరాయంగా పారాయణం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. భగవద్గీత ప్రాశస్త్యాన్ని భక్తులకు తెలియజేసేందుకు 2020 సెప్టెంబర్ 10వ తేదీ నుండి తిరుమలలోని నాదనీరాజనం వేదికపై గీతా పారాయణం నిర్వహిస్తున్నారు.

సిఎం పర్యటనపై ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఈ నెల 30 న మదనపల్లిలో విద్యా దీవెన కార్యక్రమానికి రానున్న నేపథ్యంలో రేణిగుంట విమానాశ్రయంలో ఏర్పాట్లనుకలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జిల్లా ఎస్.పి పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 30 న విద్యా దీవెన కార్యక్రమంలో పాల్గొనడానికి రేణిగుంట విమానాశ్రయానికి ఉదయం 10.20 గంటలకు చేరుకొని హెలికాప్టర్ లో మదనపల్లి వెళ్లనున్నారని, కార్యక్రమం అనంతరం మద్యాహ్నం 1.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి తాడేపల్లిలో మరో కార్యక్రమంలో పాల్గొననున్నారని, ఎక్కడా ఆలస్యం కలగకుండా చూడాలని సూచించారు. జిల్లా ఎస్.పి. భద్రతా ఏర్పాట్లపై విమానాశ్రయ, పోలీసు అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.డి.ఓ. రామారావు, విమానాశ్రయ డిప్యూటీ కమాండెంట్ డి.సి.శుక్లా, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర రెడ్డి, డి.ఎం. అండ్ హెచ్ ఓ శ్రీహరి, ఇంటలిజెన్స్ ఇన్స్పెక్టర్ సింహాద్రి నాయుడు, మెడికల్ ఆఫీసర్ ప్రకాష్, రేణిగుంట తహశీల్దార్ శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో కన్నడ హీరో దర్శన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి కన్నడ స్టార్ హీరో దర్శన్, బొమ్మనహల్లి ఎమ్మెల్యే సతీష్ రెడ్డి విచ్చేశారు. వీరికి స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. రాహు-కేతు పూజలు చేసుకున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలు, అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తి ప్రాసస్త్యాన్ని, కలంకారి ప్రత్యేకతను వివరించారు.

శరవేగంగా అభివృద్ధి పనులు : ఎంఎల్‌ఎ భూమన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో గతంలో ఎన్నడూ లేనట్టుగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అభివద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని మేయర్ డాక్టర్ శిరీష ప్రాతినిధ్యం వహిస్తున్న 27వ డివిజన్ 16 లక్షలతో నిర్మించిన తాతానగర్లో తాగునీరు, భూగర్భ డ్రైనేజి లైన్, సిసి రోడ్లను అదేవిధంగా అన్నా అనితా యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న 48వ డివిజన్ సత్యనారాయణపురంలో 36 లక్షలతో నిర్మించిన సిసి రోడ్ ను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైనటువంటి అభివద్ధి పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయడం జరుగుతున్నాయని, తిరుపతి అభివద్ధికి చేపట్టాల్సిన అన్ని రకాల చర్యలను అందరి సహకారంతో పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, అన్నా సంధ్యా యాదవ్, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, దేవిక, వైసిపి నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, మాజీ కౌన్సిలర్ దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలూ వేగవంతం కావాలి

తిరుపతి నగర పాలక పరిధిలో లబ్దిదారులకు కేటాయించిన గృహ నిర్మాణాలకు కావాల్సిన మెటీరియల్ అందుబాటులో ఉందని, వర్షాలు తగ్గిన నేపథ్యంలో నిర్మాణాలు వేగవంతం కావాలని ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నగర పాలక సంస్థ పరిధిలోని పేదలకు కేటాయించిన

అభివృద్ధి పనులపై సమీక్షలో ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి

ఇళ్లస్థలాలు, ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆరు లేఔట్లలోని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని, ప్రతి లేఔట్‌లో రోజుకు కనీసం 50 గృహాల స్టేజి కన్వర్షన్లు జరగాలన్నారు. ప్రతి రోజూ ప్రతి లేఔట్‌లలో కనీసం 15వేల ఇటుకలను అందుబాటులో ఉంచేందుకు ఆర్డీవోలు, తహశీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో పట్టా ఇచ్చి జియో ట్యాగింగ్ జరగలేదని, స్తలం చూపలేదనే ఏ ఒక్కరూ అడగరాదన్నారు. చిందేపల్లిలో 7512, జి.పాళెంలో 1647, కల్లూరు 3188, ఎం.కొత్తపల్లిలో 5027, సూరప్పకశంలో 343, టిసి అగ్రహారంలో 1276 కలిపి మొత్తం 18,924 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో 2540 గృహాలు ఇంకా ప్రారంభం కాలేదన్నారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆర్డీవోలు కనకనరసారెడ్డి, రామారావు, హౌసింగ్ పీడీ చంద్రశేఖర్‌బాబు, కార్పొరేటర్ వెంకటేష్ పాల్గొన్నారు.

'మా గ్రామకంఠం భూమిలోనే స్థలాలివ్వాలి'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎన్నో ఏళ్లుగా తమ గ్రామకంఠానికి సంబంధించిన భూమిలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నామని, పెత్తందారులు, రెవెన్యూ అధికారులు కలిసి బలవంతంగా గ్రామకంఠం భూమిలో వేసుకున్న గుడిసెలను కుట్రపూరితంగా తొలగించాలని చూస్తున్నారని రామ చంద్రాపురం మండలం పివిపురం పంచాయతీ బలిజపల్లి దళితవాడకు చెందిన దళితులు సరళ, బుజ్జమ్మ, మంజుల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్ లో విలేకరుల సమావేశంలో సంబంధిత దళిత మహిళలు మాట్లాడుతూ పివిపురం పంచాయతీ బలిజపల్లి సర్వేనెంబర్ 46/13ఎ లోని గ్రామ కంఠం విస్తీర్ణం 0.56 సెంట్లు ఉందని ఈ భూమిపై స్థానికంగా ఉన్న అగ్రకుల రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో కళ్యాణ మండపం నిర్మించాలని చూస్తున్నారన్నారు. ఈ సమస్యపై 2017 వ సంవత్సరం నుండి జిల్లా ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడో జగనన్న కాలనీకి పోవడానికి తమకు ఇష్టం లేదని, తమ గ్రామ కంఠం భూమిలోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులను కోరుతున్నామన్నారు. అలాకాకుండా బలవంతంగా గుడిసెల తొలగింపు చేయాలనుకుంటే మాత్రం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామకంఠంపై రెవెన్యూ అధికారులకు ఎటువంటి హక్కు లేదని చట్టం చెబుతున్నా రాజకీయ నాయకుల ప్రోద్బలంతో గ్రామకంఠం భూమిలో ఏర్పాటు చేసుకున్న గుడిసెలను తొలగించాలని చూస్తున్నారని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని న్యాయవాది దినేష్ కుమార్ స్పష్టం చేశారు. 187 జీవో ద్వారా గ్రామకంఠంపై రెవెన్యూ అధికారులకు ఎటువంటి హక్కు లేదని స్పష్టం చేస్తున్నా గ్రామకంఠం భూమిలో దళితులు వేసుకున్న గుడిసెలను తొలగించడానికి రావడం సబబు కాదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భగత్, బాలాజీ గ్రామస్తులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్బంధం

ప్రజాశక్తి -చిత్తూరు ప్రతినిధి: విజయవాడలో ఉపాధ్యాయులు తలపెట్టిన ధర్నాను భగ్నం చేసేందుకు పోలీసులు అడుగడుగునా నిర్బంధాన్ని ప్రయోగించారు. విజయవాడకు వెళ్లనీకుండా చేసేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా ఉదయం పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు నోటీసులు ఇచ్చారు. కొందరిని ఇంటి వద్ద గృహనిర్బంధం ప్రయోగించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ ఇంటిముందర సోమవారం అర్థరాత్రి నుంచి పహారా కాశారు. కొంతమంది ఉపాధ్యాయులు పోలీసుల కళ్ళు కప్పి విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించండి

ఎంఈఓ తిరుమల రాజు

ప్రజాశక్తి -పుత్తూరు టౌన్: తల్లిదండ్రులు మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించండి అని పుత్తూరు మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని భవాని నగర్ పాఠశాలలో తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి తిరుమల రాజు మాట్లాడుతూ మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తే అన్ని రంగాల్లో ముందుకు వెళ్తారన్నారు. ఈ కార్యక్రమంలో రాంపాలెం కుమార్ వేలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు .

జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించండి

పీడీ శ్రీనివాస్ ప్రసాద్

ప్రజాశక్తి - దొరవారిసత్రం : జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ కల్పించండి అంటూ పీడీ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఆయన మంగళవారం దొరవారిసత్రం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ఉపాధి హామీ పని సామాజిక తనిఖీ బృందం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనులలో అవకతవకలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సింగయ్య, ఏపీడీ రవికుమార్ నాయుడు, అంబుజమ్మ, మస్తాన్ సినాయుడు, ఎస్‌ఆర్‌పిజెడ్ఎస్ రాజు, ఏపీఓ విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిన్న పంపిణీ చేశారు.. నేడు మూసేశారు

రైతుల ఆవేదన

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు మండలంలోని అల్లపుకంట గ్రామంలో విత్తనాలు వేరుశనగ పంపిణీ లక్షణంగా సోమవారం ప్రారంభించారు. మంగళవారం వచ్చిన లారీ పది బస్తాలు తక్కువైనందని రైతులకు విత్తనాలు వేరుశనగ పంపిణీ ఆపివేశారు. ఈ పాటిల్ లెక్కలు తేలేంతవరకు విత్తనాలు పంపిణీ చేయబోమని అధికారి చెప్పగా కొద్దిసేపు వివాదం నెలకొంది. అల్లపుకంట గ్రామానికి చెందిన రైతులు నచ్చజెప్పి రేపు రమ్మని చెప్పడంతో చుట్టు పక్కల నుండి గ్రామాల రైతుల ట్రాక్టర్లు, ఆటోలు వెనుతిరిగాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వేరుశనగ విత్తనాల పంపిణీ అల్లపు గ్రామంలో ఉంటున్న సమస్యపై తక్షణం పరిష్కరించాలని సీపీఎం సత్యవేడు మండల కార్యదర్శి కోరారు.

క్రీడా పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్ డ్రమ్‌లను మంత్రి ఆర్.కె.రోజా సోదరులు రాంప్రసాద్ రెడ్డి చేతులు మీదుగా నింద్ర మండలం పాదిరెడు దళితవాడ, పూత్తూరు మండలంలోని కె.బీ.ఆర్ పురం దళితవాడస, రామసముద్రం గ్రామాలలో యువతకు మంగళవారం పంపిణీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో యువకుల కోరిక మేరకు నగరి నియోజక వర్గంలోని పాదిరెడు దళితవాడ, కె.బీ.ఆర్ పురం దళితవాడ, రామసముద్రం గ్రామాలలో యువతకు నగరిలోని మంత్రి కార్యాలయంలో అక్షరాల లక్ష రూపాయలు విలువ చేసే క్రికెట్ కిట్లు వాలీబాల్ కిట్లు, డ్రమ్స్ అందించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

అంతర్ కళాశాల హ్యాండ్ బాల్

విజేత సీకాం డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పరిధిలోని అంతర డిగ్రీ కళాశాలల బాలుర హ్యాండ్ బాల్ పోటీలను నిర్వ హించారు. ఈ పోటీలలో సీకాం డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయం సాధించినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య యం.శివశంకర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను వర్సిటీ సిడిసి డీన్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ అప్పారావు అందించారు. రన్నర్‌గా బిఎస్ఆర్ డిగ్రీ కళాశాల నిలిచిందని వెల్లడించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ అకాడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -పిచ్చాటూరు: ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ జిఎస్ నవీన్ కుమార్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో స్టెప్స్ స్వచ్ఛంద సేవా సంస్థ, మన సంస్కృతి కళాబృందం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని అవగాహన కల్పించారు. పిచ్చాటూరు డాక్టర్ గాయత్రి సూపర్‌వైజర్ నాగరాజు స్టెప్స్ టిఐఎన్‌జిఓ ప్రోగ్రాం మేనేజర్ ఆర్ముగం, ఏఎన్ఎం స్టాఫ్, మన సంస్కృతి కళాబృందం రెడ్డప్ప బృందం సభ్యులు పాల్గొన్నారు.

జరి అంచు నేస్తే జరిమానా..!

- మరమగ్గాల కార్మికుల పరిస్థితి దారుణం
- కాపాడే నాధుడే కరువయ్యాడు

మరమగ్గ కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-పుత్తూరుటౌన్: జరి అంచు నేస్తే జరిమానా విధిస్తామంటూ మరమగ్గ కార్మీకులకు అధికారులు హుకుం జారీ చేశారు. దీంతో మరమగ్గ కార్మీకుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అయితే నేస్తే సాదా నేయండి లేకుంటే మరమగ్గాలకు జరిమానా విధిస్తాం లేదా సీల్డ్ వేస్తామని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు పుత్తూరు పట్టణంలోని గేట్ పుత్తూరు మరమగ్గ కార్మికుల ఇంటిలో మంగళవారం సోదాలు నిర్వహించారు. జెరి అంచునేస్తే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మరమగ్గ కార్మికులు దిక్కుతోచక విలవిలలాడుతున్నారు. కరోనా తర్వాత సాదా పంచలు నేస్తే మీటర్‌కు రూ.6లు ఇస్తున్నారని జరి అంచునేస్తే రూ.10లు అవుతుందని మరమగ్గ కార్మికులు చెబుతున్నారు. జరీనేయడానికి ఏకాంబరకుప్పం నుంచి ముడి సరుకు తెచ్చుకుంటే ఈ విధంగా అధికారులు వేధిస్తు న్నారని స్థానిక మరమగ్గ కార్మికులు వాపోయారు. నాలుగు మగ్గాలు ఉన్న కార్మి కుడు నెలకు రూ.2007లు కరెంట్ చార్జీ వస్తోందని, గతంలో ఎప్పుడూ కూడా ఈ విధంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమగ్గం లేని వారు కూలికి వెళ్తే కూలి కూడా గిట్టుబాటు రావడం లేదని వాపోతున్నారు. అందువల్ల అధికారులు చర్యలు తీసుకుని మరమగ్గ కార్మీకులకు జరీ పంచెలు నేసే వెసలుబాటు మరమగ్గ కార్మీకులు కోరుతూ వున్నారు.

దురుసుగా ప్రవర్తించే అధికారులకు బుద్ధిచెబుతాం

ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- గూడూరు: దురుసుగా ప్రవర్తించే అధికారులకు బుద్ధిచెబుతామని ఏపీ ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) అనుబంధం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా గూడూరులోని సి.ఐ.టి.యు కార్యాలయంలో సిఐటియు కార్మిక ఉద్యమ నేత నండూరి ప్రసాద్ రావుకి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ఒక సంవత్సరం, లేదా రెండు సంవత్సరాలు ఉండిపోయే వాళ్ళని, గుర్తించుకోవాలని కార్మికులపై పెత్తనం, వేధింపులు దాడులు, జరిపితే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కార్మికురాలిపై సంవత్సరం క్రితం బాబురావు అనే మేస్త్రి విధి నిర్వహణలో చెప్పుతో కొట్టడం జరిగిందని, ఆమె బోరున విలపిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు కార్మికులపై దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని, సి.ఐ.టి.యు సంఘం తోడుగా ఉంటుందన్నారు. ఒకవేళ కార్మికులపై అధికారులు చేయి జారితే వీపు పగలగొట్టాల్సి వస్తుందని ఆయన ఆవేశాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షులు పి.మణి, ఉమ్మడి నెల్లూరు జిల్లా మున్సిపల్ యూనియన్ కార్యదర్శి పెంచల నరసయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, కార్యదర్శి బి.గోపి, పట్టణ కార్యదర్శి కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, సుబ్బయ్య, కె.వి.పి.ఎస్. నాయకులు ప్రసాద్, గూడూరు సి.ఐ.టి.యు ఆటో కార్మిక సంఘం కార్యదర్శి బి.వి. రమణయ్య, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'కీర్తి'న్యూరోలో మెదడు నరాల వ్యాధులకు నాణ్యమైన చికిత్స

ప్రజాశక్తి-తిరుపతి సిటి

నరాల సంబంధిత వ్యాధులకు 'కీర్తి'న్యూరో హాస్పిటల్‌లో నాణ్యమైన చికిత్స అందిస్తున్నట్లు ఆ ఆసుపత్రి అధినేత, ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టరు ఎఎస్.కీర్తి తెలిపారు. స్థానిక కరకం బాడీరోడ్డులోని హోటల్ గెస్ట్‌లైన్‌కు ఎదురుగా ఉన్న కీర్తి న్యూరో హాస్పిటల్‌లో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉరుకులు పరుగులు జీవితంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడితో కూడుకున్న జీవినాన్ని కొనసాగిస్తున్నారని, ఒత్తిడి వల్ల అనేక సమస్యలు ఉత్పన్న మవుతున్నాయన్నారు. పక్షవాతం నాడీ వ్యవస్థకు సంబంధించిన వ్యాధి అన్నారు. శరీరం లోని వివిధ అవయ వాలు ప్రయత్న పూర్వక చలనాలను కోల్పోయే రుగ్మతను 'పక్షవాతం' (పెరాలసిస్) అంటారు. దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అన్నారు

పక్షవాతానికి ముఖ్యమైన కారణాలు:

అధిక రక్తపోటు, మెదడుకు రక్తసరఫరాలో అంతరాయం, పోలియో వంటి వైరస్ సంబంధిత రోగాలు, ప్రమాదాలు, వెన్నెముకలలోని కొన్ని లోపాలు, కొన్ని రకాల విష పదార్థాలు, నిత్యం గర్భ నిరోధక మాత్రలు వాడే మహిళలు, యువతుల్లో పక్షవాతం వచ్చే అవకాశాలు రెండు రెట్లు అధికమట. పక్షవాతాన్ని గమనించి వెనువెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స చేసుకుంటే దాన్ని నివారించే అవకాశం ఉందన్నారు. పక్షవాతానికి అత్యవసర అధునాతన చికిత్స కీర్తి న్యూరో హాస్పిటల్‌లో అందుబాటులో ఉందన్నారు. పక్షవాతం, మూర్ఛవ్యాధి, కోమా, మెదడు వాపు వ్యాధి, వణుకు, నిద్రలేమి, మతిమరుపు మూతివంకర, మెడ, నడుములు నొప్పి, వెన్నుపాము జబ్బులు, తిమ్మిర్లు, అరికాళ్ల మంటలు, నరముల కండరాల నొప్పులు, బలహీనత, మధుమేహ వ్యాధి సంబంధిత, నరాల జబ్బులు, మైగ్రేన్, ఇతర తల నొప్పులకు ఇక్కడ చికిత్స లభిస్తుందన్నారు. దీన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 0877 2222201, 9441286414 నెంబరును సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు

-అవుట్ పేషెంట్, ఇన్‌పేషెంట్స్‌కు చికిత్స.

-స్ట్రోక్ యూనిట్, ఇఇజి అండ్ ఇఎన్ఎంజి సౌకర్యం

-క్లీనికల్ ల్యాబ్, ఫిజియోథెరపి.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన ఏవో

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండల పరిధిలో ఉన్న ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను మంగళవారం సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ-పాస్ మిషన్ నిల్వలలో తేడా ఉండకూడదని అలాగే ఎరువులు, పురుగుల మందులు కొన్న ప్రతి ఒక్క రైతుకి రసీదులు తప్పక ఇవ్వాలని తెలిపారు. ముఖ్యంగా ఎంఆర్‌పి ధరలకే ఎరువులు అమ్మాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు.

యర్రావారిపాలెం: మండల కేంద్రంలో గల పలు ఎరువుల దుకాణాలను మంగళవారం తనిఖీ చేసినట్టు మండల వ్యవసాయ అధికారి ఖాదర్ భాష ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తనిఖీలలో భాగంగా సొసైటీ, కాలంగి ట్రేడర్స్ గల ఎరువుల బస్తాల తూకాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని తనిఖీలు చేశారు. మండలంలో గల దుకాణదారులు రైతులకు, ఎరువులను అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గూడూరు : పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను గూడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.గోపి నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్ నిల్వలు , ఈ పాస్ మిషన్ స్టాక్ నిల్వలు తేడా ఉండడం వలన సుమారు రూ.88200ల విలువగల ఎరువుల అమ్మకాలు నిలిపివేయడం(స్టాప్ సేల్స్) జరిగిందని తెలిపారు. ప్రతి డీలరు రైతు కొనుగోలు చేసిన తరువాత తప్పనిసరిగా రైతుకు బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఎంఆర్పీ రేటు ప్రకారమే ఎరువులు అమ్మాలని అలా లేనిచో వారిపై కఠిన చర్యలు తీసుకో బడుతాయని హెచ్చరించారు.

ఎన్ఎస్ఆర్ కాలనీలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి- నాయుడుపేట: నాయుడు పేట మునిసిపాలిటీలోని రెండో వార్డు పరిధిలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో పేరుకుపోయిన చెత్తను కౌన్సిలర్ పాలేటి నాగార్జున తొలగించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్మన్ దీపిక సహకారంతో కాలనీలోని ట్యాంక్ వద్ద కూరుకుపోయిన బురదను, చెత్తను, చెట్లను జేసీబీతో తొలగించి శుభ్రం చేయించారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ సాధ్యం : డీఈవో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యం క్రమశిక్షణలు కలిగి ఉండాలంటే స్కౌట్స్ అండ్ గైడ్స్ తో సాధ్యమవుతుందని, ఈ దిశగా తిరుపతి అర్బన్ మండలం మంగళం పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటు అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. మంగళవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో క్రమశిక్షణ భావాలు పెంపొందించేలా కృషిచేసిన ఉపాధ్యా యులు పిల్లపాలెం మునిరత్నం, ఇ. వేంకటేశులకు డిఇఓ శేఖర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారెంట్లును అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు సి.కేశవులునాయుడు ఉపాధ్యాయులను అభినందించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - కేవిబిపురం: మండలంలోని ఏపీ మోడల్ స్కూలు కస్తూరిబా గాంధీ స్కూలు ప్రాథమిక ఉన్నత పాఠశాలను మంగళవారం చిన్నారులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని డివైఈవో రఘురామయ్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా అందజేయా లని ఆయన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోంచేస్తూ మీకేమన్నా సమస్యలు ఉన్నాయని విద్యార్థులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఓజిలి :ప్రతి ఒక్కరు విధిగా చేతులు తరచూ శుభ్రంగా కడుక్కోవడం వలన ఆరోగ్యంగా ఉంటామని, మంచి ఆహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత కూడా పాటించాలని సోషల్ డెవలప్ మెంట్ ఎక్స్‌పర్ట్ యల్లసిరి నాగార్జున అన్నారు. మంగళవారం మండలంలోని మనవాలి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో జల జీవన్ మిషన్ ఆధ్వర్యంలో రైజస్ టీమ్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమన్నారు. రైజస్ ఐఎస్ఎలు, పాఠశాల ఉపాధ్యాయులు యస్ నాగరాజు, అంగన్వాడి టీచర్ స్నేహలత, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సకాలంలో పంట పండించుకు నేందుకు సబ్సిడీ కింద విత్తనాల పంపిణీ కార్య క్రమం నిర్వహించారు. అందులో భాగంగా తడుకు, రామకృష్ణాపురం, సిరుగురాజుపాలెం మూడు గ్రామ పంచాయతీలకు కలిపి తడుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సర్పంచ్ మురళి యాదవ్, వైసీపీ నాయకులు దేవేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మునుస్వామి రెడ్డి చేతుల మీదుగా రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారి ప్రత్యూష, పంచాయతీ కార్యదర్శి హరిత, రైతులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డాక్టర్ కుడుముల వెంకటనారాయణ దాతృత్వంలో చెకుముకి సైన్స్ మండలస్థాయి పరీక్షలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో వచ్చిన విద్యార్థిని, విద్యార్థులకు ముఖ్య అతిథిగా గా విచ్చేసిన రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ చేతులమీదుగా మంగళవారం బహుమతులు మెమెంటో, గిఫ్ట్‌లను అందజేశారు. జె.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్ర ప్రసాద్, చెంచునారాయణ, రవూఫ్, పురు షోత్త మరావు, రామ మోహన్, కటకంశ్రీను, గోపి, రాధయ్య, స్కూల్ హెచ్‌యంలు, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు విధ్యార్దులు పాల్గొన్నారు.

రాప్తాడుఎమ్మెల్యే సోదరులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-గూడూర్: జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యే సోదరులు దుర్భషలాడటాన్ని నిరసిస్తూ పార్టీ కార్యాలయ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాశింసునీల్ కుమార్ సూచనల మేరకు గూడూరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలసి సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించారు..ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి, గూడూరు మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వర్లు రాజు,పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య,పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు తాతపూడి ఇశ్రాయల్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు తిరుపాలు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

25ఎర్రచందనం దుంగలు స్వాధీనం

నలుగురు స్మగ్లర్ల అరెస్టు

ప్రజాశక్తి -తిరుపతి(మంగళం: తిరుపతి సమీపంలోని కరకంబాడి అటవీ ప్రాంతంలో 25 ఎర్రచందనం దుంగలతో పాటు నలుగురు తమిళ స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ మేడా సుందరరావు ఆదేశాల మేరకు రైల్వే కోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ అలీబాషా బృందం సోమవారం రాత్రి నుంచి తిరుపతి రేంజి కరకంబాడి అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారన్నారు. తిమ్మినాయుడుపాలెం బీట్, యనమలబొంద వద్ద స్మగ్లర్లు తారసపడ్డారన్నారు. టాస్క్‌ఫోర్సు సిబ్బంది వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, దుంగలు పడేసి పారిపోతుండగా నలుగురు స్మగ్లర్లను పట్టు కున్నామన్నారు. వీరు తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరు తాలూకాకు చెందిన ఎ.మహేష్ (30), ఎం.గోవిందరాజు (24), కే. గోవిందన్ (37), బీ.కొప్పుస్వామి (3)లుగా గుర్తించారు. వీరిని అరెస్టు చేసి అక్కడున్న 25 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన వారి కోసం గాలింపులు చేపట్టామన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానానికి దారి కల్పించండి

కుక్కంబాకం గ్రామస్తులు

ప్రజాశక్తి-బిఎన్‌కండ్రిగ: మండలంలోని కుక్కంబాకం గ్రామంలో శ్మశానానికి దారి లేక, కావలసినంత భూమి లేక ఎన్నో సంవత్సరాలుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో సుమారుగా వెయ్యి కుటుంబాలు నివాసముంటున్నాయి. అక్కడ ఉన్న శ్మశానం కనీసం రెండు సెంట్లు భూమి కూడా లేదు. తరాలు మారినా పార్టీల అధికారాలు మారినా, అధికారులు మారినా శ్మశానానికి తగినంత భూమిని కానీ ఆ భూమికి కావలసిన దారి కూడా చూపిన పాపాన పోలేదన్నారు. శ్మశానానికి 27 అడుగుల దూరంలో ఉన్న మెయిన్ రోడ్డు నుండి శ్మశానానికి మధ్యలో పంట పొలాలు ఉన్నాయని ఆ పంట పొలంలో సుమారు ఒకటిన్నర సెంటు భూమి యజమానులు ఇస్తే మెయిన్ రోడ్డు నుండి నేరుగా శ్మశానానికి వెళుతుంది. స్మశానం దగ్గరే 10 సెంట్లు గ్రామ కంఠం భూమి కూడా ఉంది. ఆ భూమిలో కాస్త యజమాను భూమిలో కాస్త అధికారులు చొరవ తీసుకుని భూమిని ఇప్పిస్తే ఆ గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా శ్మశానానికి వెళ్లగలరు. అంతేకాకుండా ఆ కొద్ది భూమి శ్మశానంలో ఒకరి మీద ఒకరిని కాల్చడం కానీ పూడ్చడం కానీ చాలా ఇబ్బందికి గురవుతున్నారు. కావున మండల స్థాయి అధికారులు, మండల స్థాయి నాయకులు చొరవ తీసుకుని ఆ గ్రామానికి కావలసిన భూమి ఇచ్చి శ్మశానానికి దారి కల్పిస్తారని తరాలు పైబడి గ్రామస్తులు ఆశిస్తున్నారు.

పూరిగుడిసెలు లేని కాలనీలను..

చూడటానికే జగనన్న లేఔట్లు

గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి -సత్యవేడు: పూరి గుడిసెలు లేని కాలనీలను చూడడానికే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న లేఔట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గుర్తు చేశారు. మంగళవారం మండల పరిధిలోని రాజగోపాలపురం సచివాలయ పరిధిలోని యానాది కాలనీ, పివిపురం సచివాలయ పరిధిలోని రేపల్లెవాడ దళితవాడ, పివిపురం తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన, గ్రామ సర్పంచ్ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో గడపగడపకు మనకు ప్రభుత్వ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి, జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా కార్మిక సంఘం అధ్యక్షులు బీరేంద్ర వర్మ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాలాజీ రెడ్డి, బెల్ట్ రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం మీడియాతో మాట్లాడుతూ రాజగోపాలపురం యానాది కాలనీలో నివసిస్తున్న నిరుపేదలందరికి పక్కా గృహాలను నిర్మిస్తామన్నారు. ఇందుకు సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు. మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, ఎంపీటీసీలు బాలయ్య, మోహన్ రెడ్డి,శరవణ,నాగమ్మ , వ్యవసాయ మండల సలహా సంఘం చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలు

ప్రజాశక్తి -బిఎన్‌కండ్రిగ: మండలంలోని కళ్ళివెట్టు ఉన్నత పాఠశాలలో మంగళ వారం ఉదయం సైన్స్ ప్రదర్శనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్ర ధా నో పా ధ్యా య ు లు రమణయ్య మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో శాస్త్ర సాంకేతిక పరంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవలసిన అవసరం ఉందని ప్రధానోపాధ్యాయులు రమణయ్య అన్నారు. మంగళవారం మండలంలోని స్థానిక కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులు ఒబ్బు ప్రసాద్, వాణిల ఆధ్వర్యంలో విద్యార్థులచే తయారు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రయోగాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టే ఈ ప్రదర్శన పాఠశాల స్థాయిలో అందుబాటులో ఉన్న వనరులతో ఆకట్టుకునేలా ప్రయోగాలను విద్యార్థులు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ విద్యార్థి విభాగం

అధ్యక్షుడిగా కిషోర్

ప్రజాశక్తి-గూడూరు: నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదూరు రత్నం మాదిగ, రాష్ట్ర సలహాదారు చిగురుపాటి పవన్ మాదిగ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా కాల గంధకిషోర్‌ను ఎంపికచేశారు. ఆదూరు రత్నం మాదిగ మాట్లాడుతూ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థుల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసమే విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సలహాదారు చిగురుపాటి పవన్ మాదిగ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా రాష్ట్ర కార్యదర్శి పారి భాస్కర్ మాదిగ, విద్యార్థి విభాగం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

నాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు

- టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి
- పులిగోరు మురళిపై పరువు నష్టం కేసు వేస్తాం
- బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పులుగోరు మురళీ కృష్ణారెడ్డి పనిగట్టుకుని ఈర్ష ద్వేషాలతో తనపై బురదజల్లే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని టౌన్ బ్యాంకు ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి అన్నారు. గత 12 సంవత్సరాలుగా ఛైర్మన్‌గా ఉన్న మురళీకృష్ణారెడ్డి బ్యాంకు అభివృద్ధిని పట్టించుకోకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తూ లోన్లు మంజూరు చేసి రికవరీలు చేయకుండా మొండి బకాయిలను పేర్చి పెట్టారన్నారు. నూతన పాలకమండలి ఏర్పడిన నాలుగు నెలల కాలంలోనే మొండి బకాయిలుగా ఉన్న మొత్తంలో మూడున్నర కోట్ల రూపాయలను వసూలు చేయగలిగామని, పార్టీలకతీతంగా జవాబుదారీగా బ్యాంకు అభివృద్ధి కోసం పని చేస్తుంటే మాజీ ఛైర్మన్ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, బ్యాంకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న గణేష్‌ను తాను కొట్టానని ఎక్కడైనా ఆధారం ఉందా అని ప్రశ్నించారు. గణేష్ మద్యం దుకాణం వద్ద మద్యం తాగేవారితో గొడవ పడితే తానే కొట్టినట్టుగా తనకు అంటగట్టారన్నారు. బ్యాంక్ ఉద్యోగుల సంక్షేమం కోసం పిఆర్సి అమలు చేయడానికి ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి విజ్ఞప్తి చేశామన్నారు. అలానే టౌన్ బ్యాంకు ద్వారా డ్వాక్రా మహిళలకు రుణాలు ఇవ్వడానికి తగిన అనుమతుల కోసం ఆర్థిక శాఖ అధికారులకు వినతి ఇవ్వడం జరిగిందన్నారు. ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ప్రతి ఒక్క ఉద్యోగికి పది లక్షల బీమాను చేయించామన్నారు. ఇలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే లేనిపోని ఆరోపణలు చేసిన పులుగోరు మురళీకృష్ణారెడ్డిపై పరువునష్టం దావా వేస్తున్నామన్నారు. గతంలో పులుగోరు మురళీకృష్ణారెడ్డి ఉద్యోగాలు ఇప్పిస్తానని 70 మంది వద్ద 10 లక్షల చొప్పున కోట్ల రూపాయలు వసూలు చేశారని, దీనిపై 2008లో దినపత్రికలలో కూడా వార్తలు వచ్చాయన్నారు. ఈ విషయమై విచారణ వేగంగా జరుగుతోందని, విచారణను ఎదుర్కొనడానికి పులుగోరు మురళీకృష్ణారెడ్డి సిద్ధంగా ఉండాలన్నారు. బ్యాంకు ద్వారా లోన్లు పొంది, రికవరీ చేయడానికి ఆస్తులను సేల్ చేయడానికి బ్యాంకు పాలకమండలి విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ ఐదు మంది సేల్స్ ఆఫీసర్లను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వాసు, జ్యోతిప్రకాష్, చంద్రయ్య, వెంకటేష్ రాయల్, నాగయ్య, అమర్నాథరెడ్డి, కాసించోటా బాయ్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌ను కొట్టి తరిమేశారు: టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి టౌన్ బ్యాంక్ ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి వాచ్‌మెన్ గణేష్‌ను కొట్టి, భయపెట్టి తరిమేశారని టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ పులుగోరు మురళీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో ఆరోపించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రస్తుత ఛైర్మన్ కేతం జయచంద్రారెడ్డి అవాస్తవాలను మీడియాకు వివరించారన్నారు. ఛైర్మన్‌కు భయపడి గణేష్ అనే అతను నేపాల్‌కి వెళ్ళిపోయాడని, అదే బ్యాంకులో నేపాల్‌కి చెందిన వాళ్ళని కో-ఆపరేటివ్ బ్యాంకు యూనియన్ లీడర్ ద్వారా బెదిరించి, భయపెట్టారన్నారు. గణేష్ ఎంప్లాయ్ లోన్ ద్వారా పూర్వం తీసుకున్న 7లక్షలతో పరారైనట్టు పోలీస్ కంప్లైంట్ పెడతామని వాళ్ళ అమ్మని, తమ్ముడిని బెదిరించి, కొన్ని వాళ్లకు అనుకూలమైన కాగితాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. వాళ్ళ తమ్ముడు మొబైల్ నుంచి మాట్లాడి గణేష్‌ను భయపెట్టి అనుకూలంగా మాట్లాడించి, దానిని రికార్డు చేసి ప్రెస్‌కి చూపించాడన్నారు. మా హయంలో ఎంప్లాయిస్‌కు పిఆర్సి, డిఎలను సకాలంలో అందించామన్నారు. దొంగ లోన్లు ఇచ్చారని చెబుతున్న ఛైర్మన్ ఏ ఒక్కటి అయినా నిరూపించుకోమని సవాలు విసురుతున్నానన్నారు. అలాగే మార్టిగేజ్ లోన్ తీసుకున్న వారి దగ్గర కమిషన్ తీసుకున్నాననేది నిరూపించాలన్నారు. 70 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ఉద్యోగం ఇచ్చినందుకు గాను డబ్బులు తీసుకున్నానని ఆరోపించారని, ఏ ఎంక్వయిరీ అయినా స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులతో సఖ్యతగా ఉంటానని చెబుతూనే నాలుగు నెలల్లో 8మంది ఎంప్లాయిస్‌కి మెమోస్ ఇచ్చారని గుర్తు చేశారు.

BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL SPECIAL DISTRICT JUDGE NO.1 AT THIRUVALLUR

M.C.O.P. NO. 96 OF 2022

M. Dhanakotti & Others ... Petitioners

Vs

A. Sirisha & another ... Respondents

NOTICE

To:

R1 - A. Sirisha D/o. A. Siva Sankar Reddy D.No. 127, Thimmasamudram Village, Ragigunta Post, K.V.B. Puram, Chittoor District, Andhra Pradesh - 517643.

Take notice that the above O.P. is posted on 23-12-2022 for your appearance in the above court. You are hereby asked to appear before the above said court, on the above said date, at 10.00 am either in person or by pleader without fail. If you fail to attend as above said, you would be called absent and set ex-parte.

M/s. V. MAHESWARI, B.Sc., B.L., R. KAMALAKARAN, M.A., B.L., Counsel for the Petitioners, Tiruvallur.